# లెక్క



యస్వీఆర్

"మధూ!.... ఇంట్లో మన విషయం చెప్పావా?"

"లేదు.... ఆ... అవకాశం రాలేదు.... పైగా పెళ్ళి విషయం ఎత్తగానే నాన్న గారు ఇదిగో ఈ ఫోటోలు ఇచ్చారు. వీరిలో ఎవర్నో ఒకర్ని సెలెక్ట్ చేసుకోమన్నారు" అంది హ్యాండ్ బ్యాగ్ లోంచి మూడు ఫోటోల్ని తీసి టేబుల్ మీద ఉంచుతూ.

టేబుల్ మీద ఫోటోల్ని చేతిలోకి తీసుకొని చూశాడు మాధవ్.


"వాళ్ళ వివరాలు ఫోటో వెనుకాల ఉన్నాయ్ చూడు..." అన్న మాధురి మాట విని ఫోటో వెనక్కి తిప్పి చూశాడు ఒక్కొక్కటిగా.

"ఇతను మా పెద్దక్క చిన్న మరిది పేరు చక్రవర్తి గోవాలో నేవీలో పనిచేస్తున్నాడు. శాలరీ దాదాపుగా పది, పన్నెండువేలు ఉండొచ్చు. ఇక ఇతను మరో ఫోటోను చూపిస్తూ సత్యనారాయణ. సత్యం కంప్యూటర్స్‌లో ఇంజనీర్. జీతం పదిహేనువేలు ఉండొచ్చని అంచనా... ఇక ఇతను మాథ్స్ లెక్చరర్. వికాస్‌లో ఇతని ఆదాయం సంవత్సరానికి 2 లక్షల దాకా ఉంటుంది." అంది చివరి ఫోటోను చూపిస్తూ... వీరంతా మా ముగ్గురి అక్కల మరుదులు. వాళ్ళెవరికీ కట్నం అవసరం లేదట. వాళ్ళకి కావలసింది ఇంటి పట్టున ఉండి, భర్తను పిల్లలను ప్రేమగా చూసుకునే భార్యట. నన్ను వాళ్ళు మా అక్కల పెళ్ళిళ్ళలో చూశారు. నేను వారికి బాగా నచ్చానట. నన్ను చేసుకోవటానికి వారు బాగా ఇష్టపడ్తున్నారని మా అక్కయ్యలు మా నాన్నతో చెప్పారు." అని చెప్పటం ఆపింది.

"కొంపదీసి నీకూ వారంటే ఇష్టమా....?" అన్నాడు కాస్తంత గాబరాగా అతని వైపు ఓరకంట చూసి "ఒకవేళ వారిలో ఎవర్నో ఒకర్ని ఇష్టమని చెప్పి పెళ్ళి చేసుకున్నాననుకో అప్పుడేం చేస్తావ్". అంది అతడిని ఏడ్పిస్తున్నట్లుగా.

"మాధురీ...! నువ్ లేకుండా..." అని మాటల్ని మధ్యలోనే వదిలేశాడు. వాళ్ళిద్దరూ ఒకే స్కూల్లో పనిచేస్తున్న టీచర్లు.

మాధవ్ మాధురికన్నా 4 సం॥ సీనియర్, మాధురి మ్యాథ్స్ టీచర్‌గా ఆ స్కూల్‌కు వచ్చినప్పటినుండీ మాధవ్ ఆమెను గమనించాడు. అటుపైన ప్రేమించాడు. ఆ విషయాన్ని ఆమె




ముందు ఉంచడమే కాదు, తన గురించి కూడా తెలియచెప్పాడు.

తండ్రి చనిపోవడం వల్ల వచ్చిన డబ్బుని చెల్లెలు పెళ్ళికి ఖర్చు చేశాడు. తండ్రి ఉద్యోగం తనకు రావడం వల్ల ఆ ఉద్యోగం ఆసరాగా పెద్ద చదువులు చదివి టీచర్‌గా ఉన్నానని చెప్పాడు.

అన్నీ విన్న మాధురి మాధవ్‌ను తనూ ఇష్టపడింది కానీ.... ఒకసారి మాటల మధ్యలో "తన తల్లి కట్నంగా లక్షరూపాయలన్నా తేని పిల్లని కోడలుగా అంగీకరించదేమో" అని అన్నాడు... అందుకే ఆలోచిస్తోంది తను.

ముగ్గురు అక్కల పెళ్ళిళ్ళు చేసేసరికే నాన్నగారికి ఓపికా, ఆస్తీ... అన్నీ నశించిపోయాయి.

నెలనెలా వచ్చే పెన్షన్ డబ్బుతో ఎలాగోలా కష్టపడి చదివి ఉద్యోగాన్ని పొందాను. ఉద్యోగం ఉన్న అమ్మాయినైతే ఎవరైనా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటారని అమ్మా నాన్నల ఆశ. కానీ, కట్నం లేందే ఎవరూ చేసుకోనంటున్నారు. ఆలోచనల్లోంచి తేరుకుని-

"ఛ.... ఏం మాటలు మాధవ్... ఏదో ఉడికించడానికి అన్నానలా... " అంది. నవ్వుతూ...

"సరే... సరే... ఇప్పుడేం చేద్దామని..." అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను... నాన్నగారు కట్నం ఇచ్చేస్థితిలో లేరు.. మీ అమ్మకేమో కనీసం లక్ష రూపాయలన్నా కట్నంగా కావాలి." అని అతని వైపు చూసింది అతను ఆలోచనలో పడటం గమనించి..

"ఐనా ఇంకో రెండు రోజులు టైం ఉంది ఆలోచించుకోవడానికి" అని

"సరే...! నే వెళ్ళొస్తాను.." అంటూ ఇంటి ముఖం పట్టింది.

"ఏమన్నాడే నీ మాధవుడు" అంటూ అక్కలు ముగ్గురూ చుట్టూ చేరారు.

"ప్చ్... లాభం లేదక్కా! అతను వాళ్ళ అమ్మ మాటను జవదాటని వాడిలా ఉన్నాడు" అంది బాధగా.

"మావల్ల నీకు ఎలాంటి సహాయమూ జరుగలేదు. నేను మా మరిదిని కన్నతల్లిలా పెంచాను. చివరకు నిన్ను పెళ్ళి చేసుకోమని అడిగితే... పదిలక్షలన్నా కట్నంగా ఇచ్చే పిల్లనైతేనే చేసుకుంటానన్నాడు." అంది పెద్దక్క ఏడుస్తున్నట్లుగా.

"మా మరిదికి ఒక కాలు కుంటికాలు. ఐనా కనీసంగా 3 లక్షలైనా కట్నంగా కావాలిట." అంది ఒక అక్క.

"మా మరిదికి ఇది రెండో పెళ్ళి మొదటి భార్యకో కూతురుంది. ఐనా - కట్నం మాత్రం కావాలిట." అంది వెటకారంగా చిన్నక్క.

"పోనీలెండి వారిని అలాగే తీసుకోనివ్వండి... వారి వల్ల మనకే లాభం లేకున్నా... కనీసం ఈ విధంగానైనా నా పెళ్ళికి సహాయపడ్తున్నారు!" అంది.

★ ★ ★

"ఏరా....! అలా ఉన్నావేం...?" అంది మాధవ్ ముభావంగా ఉండటం చూసి తల్లి శాంత.

చెప్పాలా...? వద్దా.....? అని కాసేపు ఆలోచించి చివరకు చెప్పాడు.

"ఓరి వెర్రి నాగన్నా...! ఇంట్లో ఉండే పిల్లకైతే... కట్నంగా లక్షరూపాయలు కావాలన్నాను కానీ..., ఉద్యోగం చేసే పిల్లైతే కట్నం ఎందుకురా? పైగా అమ్మాయి నీకు నచ్చిందన్నావూ... కాబట్టి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకో..." అంది లౌక్యం తెల్సిన దానిలా.

"అక్కా! నీకు ఫోన్..." అని చెప్పి తుర్రున పారిపోయాడు పక్కింటి చిన్ను-

తను గబగబా చెప్పులేసుకుని పక్కింటి ఆంటీ వాళ్ళ ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయలు దేరింది.

ఫోన్ మాధవ్ వద్దనుండే కావచ్చు... తను ఆచీ... తూచీ... మాట్లాడి ఎలాగైనా...., మాధవ్ తననే పెళ్ళి చేసుకునేట్లు (కట్నం తీసుకోకుండా) చేయాలనుకుని, వెళ్ళి ఫోన్ అందుకుని "హలో!" అంది.

అవతలనుండి "హలో...! మాధురీ, నేను మాధవ్‌ను" అన్నాడు.

"ఆ:! ఏంటి విషయం" అంది ముక్తసరిగా...

"ఏం నిర్ణయం తీసుకున్నావ్..." అన్నాడు అసలు విషయం చెప్పకుండా

"నేనేమీ తీసుకోకుండానే... వాళ్ళే నిర్ణయించారు సత్యనారాయణతో నా పెళ్ళిని" అంది బాధను నటిస్తూ-

"అలాగా...? మరి నా విషయం ఏం చేశావ్? నా గురించి ఇంట్లో చెప్పలేదా?" అన్నాడు అసలు విషయానికి వస్తూ...

"చెప్తే... ఏం లాభం. మీ అమ్మగారు అడిగిన కట్నం ఇచ్చుకోలేరుగా..."

"ఓ... అదా! మా అమ్మకు అసలు విషయం చెప్పి ఒప్పించాను. ఆమె ఇప్పుడు మన పెళ్ళికి కట్నం అదీ అవసరం లేదంది." అన్నాడు ఆనందంగా.

"అలాగా..." అంది తనూ సంతోషంగా.

"రేపు రిజిస్ట్రార్ ఆఫీసుకు రా... అక్కడ మనం పెళ్ళి చేసుకుందాం" అన్నాడు.

"ఇంట్లో తెలిస్తే గొడవ అవుతుందేమో..." అంది.

"ఇప్పుడు అంతకు మించిన మార్గం లేదు". అన్నాడు...

"సరే... వస్తాను 11 గం॥లకు వస్తాను" అని చెప్పి ఫోన్ పెట్టేసి ఇంటికి వచ్చింది.

"అక్కా మన ప్లాన్ సక్సెస్... గ్రాండ్ సక్సెస్... అయింది... మాధవ్ వాళ్ళ అమ్మను ఒప్పించాడట... మా పెళ్ళి రేపు రిజిస్ట్రారు ఆఫీసులో జరుగబోతుంది..." అంది సంతోషంగా.

ఔను మరి. తను ఇష్టపడే అమ్మాయినే మిగతావాళ్ళు ఇష్టపడ్తున్నారని తెలిసిన ఏ మగాడైనా... ఈ నిర్ణయమే తీసుకుంటాడు. అదీ లోకం తీరు.

❋